క్లుప్తంగా

నేడు నుస్తులాపూర్ సొసైటీ గోదాం ప్రారంభం

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం గోదాంను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతారని, మండలంలోని రైతులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అధికార సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలు శనివారం సెల్‌ఫోన్, ఆధార్ కార్డును పోగొట్టుకోగా, మరో ప్రయాణికుడు గమనించి బస్టాండ్‌లోని ఆర్టీసీ కంట్రోల్ అధికారులకు అందజేశారు. కరీంనగర్‌కు చెందిన సంతోషిని సెల్‌ఫోన్ పోయిందంటూ కంట్రోల్ అధికారులకు తెలియజేసింది. ఈమేరకు పోగొట్టుకున్న సెల్‌ఫోన్, ఆధార్ కార్డును అధికారులు సంతోషినికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ జీఎస్‌రెడ్డి, ఎన్ఆర్‌కుమార్, ఏడీసీ సింగ్, ఏడీసీఎం రవీందర్, తదితరులు ఉన్నారు.

విధులకు గైర్హాజరు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

శంకరపట్నం: తహసీల్దార్ అనుపమ నాలుగు రోజులుగా విధులకు హాజరుకావడంలేదు. దీంతో రెవెన్యూ, భూసమస్యలతో పాటు భూ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరు కావడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించలేదు. రైతులతోపాటు పలువురు కార్యాలయం చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులకు గురయ్యారు. ఈవిషయమై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శివనగర్‌లో 130వ ఎన్నీల ముచ్చట్ల సాహిత్య కార్యక్రమం జరిగింది. కవి రాము ఎటిక్యాల మాట్లాడుతూ.. కవులు సామాజిక బాధ్యతతో రాయాలని, సామాజిక కోణం ఉండాలన్నారు. సమాజాన్ని మేలుకొలుపేది కవిత్వమని, సమకాలీన సామాజిక సమస్యలు ఇతివృత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి యుగేందర్ ఆతిథ్యం ఇచ్చారు. కార్యదర్శి దామరకుంట శంకరయ్య, పెనుగొండ బసవేశ్వర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ మాధవి, కవులు దేవేందర్, రవీందర్, ఇటిక్యాల రాము, అఖిల్‌కుమార్, రమణయ్య, మధు, కొమురయ్య, అరుణ్, తిరుపతి, వరప్రసాద్, బుర్ర తిరుపతి, నదిమెట్ల రామయ్య, గీతారెడ్డి తదితరులున్నారు.

జిల్లా రైస్ మిల్లర్ల సంఘం మాజీ డైరెక్టర్ మృతి



నరసింహమూర్తి (ఫైల్)

జమ్మికుంట: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి రాయికంటి నరసింహమూర్తి అనారోగ్యం కారణాలతో శనివారం మృతి చెందారు. గతంలో రెండు సార్లు జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం డైరెక్టర్‌గా, రెండు సార్లు జమ్మికుంట గ్రామ పంచాయతీ మాజీ వార్డు మెంబర్‌గా, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడిగా సేవలు అందించారు. మృతుడిడి కుటుంబానికి జిల్లా, మండల రైస్ మిల్లర్ల సంఘం నాయకలు రాజమౌళి, బచ్చు భాస్కర్, వ్యాపారులు సంతాపం తెలిపారు.

26న అండర్ పాస్ పనులు ప్రారంభం

కరీంనగర్‌టౌన్/జమ్మికుంట: జమ్మికుంట మండలంలోని తనుగుల–విలాసాగర్ రైల్వే ఎల్‌సీ నంబర్ 26 వద్ద అండర్ పాస్ నిర్మాణ పనులను ఈనెల 26న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రకటనలో తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ పనులను ఉదయం 10:30 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అండర్ పాస్ నిర్మాణంతో ప్రజలు, రైతులకు, వ్యాపారస్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సమ్మక్క, సారలమ్మ వనప్రవేశం

హుజూరాబాద్: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భావించే సమ్మక్క, సారలమ్మ జాతర శనివారం వనప్రవేశంతో ముగిసింది. ఈనెల 21న ప్రారంభమైన జాతర వనదేవతలు యథా స్థానానికి వెళ్లారు.

హుజూరాబాద్ తెనుగువాడలోని సారలమ్మ దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు అమ్మవారిని గద్దెకు తీసుకొచ్చారు. గురువారం పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని గవ్వల గుట్ట నుంచి కోయ పూజారులు సమ్మక్కను తీసుకొచ్చారు. ఇద్దరు తల్లులు గద్దెలపై చేరడంతో తల్లిబిడ్డలను దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. జాతర ముగింపు సందర్భంగా జాతర కమిటీ చైర్మన్ మూగల రాజిరెడ్డి, డైరెక్టర్లు ప్రత్యేక పూజలు చేశారు. జాతర కోసం ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు వలంటీర్లుగా భక్తులకు సేవలు అందించారు. జాతర ముగియడంతో దేవాదాయశాఖ అధికారులు జాతర కమిటీ చైర్మన్, డైరెక్టర్‌ల సమక్షంలో హుండీలకు సీల్ వేశారు.

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, మైలారం గ్రామాల్లో నాలుగు రోజుల పాటు ఘనంగా జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర శనివారంతో ముగిసింది. సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశానికి కోయ పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు తరలించారు. చివరి రోజు భక్తులు గద్దెలకు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

వీణవంక: డప్పు చప్పుళ్లు, కోయ పూజారులు ప్రత్యేక పూజల మధ్య సారలమ్మ, సమ్మక్క వనంలోకి ప్రవేశించారు. వీణవంక, పోతిరెడ్డిపల్లి, కోర్కల్, చల్లూరు గ్రామాలలో మూడు రోజులుగా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. మినీ మేడారంగా పిలిచే వీణవంక సమ్మక్క, సారలమ్మ జాతరకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు వచ్చారు. ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని సమ్మక్క–సారలమ్మ జాతర ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి చల్లంగా చూడమ్మ అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం గద్దెలపై నుంచి సమ్మక్క సారమ్మ వనప్రవేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జాతర కమిటీ సభ్యులు స్వామి, ఈఓ మారుతిరావు, కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.



శంకరపట్నంలో సమ్మక్క, సారలమ్మ గద్దెలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



వీణవంక: వనంలోకి వెళ్తున్న వనదేవతలు



గన్నేరువరం: మైలారంలో సమ్మక్క సారలమ్మల వనప్రవేశం

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



హుజూరాబాద్‌రూరల్: స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు



జమ్మికుంట: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిత్యకల్యాణోత్సవంలో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ వీర్ల సరోజన ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణోత్సవం తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి సేవలో తరించారు. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దంపతులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను కౌశిక్‌రెడ్డి దంపతులతోపాటు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు దంపతులకు అందజేశారు.

వైభవంగా శ్రీవిశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి (బొమ్మలగుడి)పురాతన దేవాలయంలో శనివారం శ్రీవిశ్వేశ్వరస్వామి కల్యాణం వేద పండితులు, ఆలయ అర్చకులు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా కల్యాణ మహోత్సవానికి కొండూరు కుటుంబసభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు , ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ సేవా సమితి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామికి ‘లక్షమల్లె, తులసి అర్చన’

మున్సిపల్ పరిధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో షోడశ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ అర్చకులు కృష్ణామాచార్యులు, వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి లక్షమల్లె, తులసి అర్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, యాగశాలలో చతుస్థానార్చన, పూర్ణాహుతి, బలిహరణతోపాటు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముక్క జితేంద్రగుప్తా, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యగిరీంద్రస్వామి జాతర

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో మత్స్యగిరీంద్రస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, జాతర కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, ఈఓ సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం

వీణవంక: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వీణవంకకు చెందిన ట్యూరిటో, యుప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. అనంతరం రూ.25వేల విరాళం అందించారు. మండలంలోని ఏ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగినా తనవంతుగా విరాళం అందిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఈ సందర్భంగా ఉదయానందన్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాజుల ప్రసన్న, చిన్నాల ఐలయ్య, కుమార్, అమ్ముల రాజు, హకీమ్, శరత్‌రెడ్డి, కొంరయ్య, రాము, రాజకొంరయ్య, రాజయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రామడుగు: వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



వీణవంక మండలం బ్రాహ్మణపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనలో ఉదయానందన్‌రెడ్డి



హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



జమ్మికుంట: స్వామివారికి లక్షమల్లె, తులసి అర్చన

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

గన్నేరువరం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రేణికుంట టోల్‌ప్లాజా సిబ్బంది అన్నారు. 35వ రోడ్డు భద్రత వారోత్సవాలను శనివారం గుండ్లపల్లిలో హెచ్‌కేఆర్ రేణికుంట టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. పాదాచారులు రోడ్డుకు ఎడమవైపు నడవాలని, చిన్నపిల్లలు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పశువులను రహదారి పక్కన మేపరాదని, ఎరుపు రంగు రేడియం స్టిక్కర్లు ఉన్న ప్రదేశం వైపు వెళ్లొద్దన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దని, ఫోర్‌వీలర్ వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని కోరారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ ప్రాణానికి ప్రమాదకరమన్నారు.



అవగాహన కల్పిస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

317 జీవోపై సబ్ కమిటీ హర్షణీయం

గన్నేరువరం: 317 జీవోపై మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో ప్రభుత్వం సబ్ కమిటీ వేయడం హర్షనీయమని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హస్నుండ్ల భాస్కర్ అన్నారు. శనివారం గుండ్లపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలన్నారు. లోకసభ ఎన్నికల్లోపే ఉద్యోగ, ఉపాధ్యాయులకు గుది బండగా మారిన 317 జీవోపై పూర్తిగా అధ్యయనం చేసి 370 జీవోకు గురైన ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. సబ్ కమిటీ రిపోర్టు కోసం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సలహాలు, సూచనలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 317 జీవోతో సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, సబ్ కమిటీతో అలాంటి న్యాయం జరుగుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాను ప్రాదిపదిక బదిలీల అవకాశం ఇవ్వాలని, అలా అయితేనే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సబ్ కమిటీతో రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు.



వనదేవతలను దర్శించుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నో బ్యాగ్ డే

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులోని నిర్వహిస్తున్న సమ్మక్క–సారలమ్మ జాతరలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వనదేవతలను దర్శించుకున్నారు. విద్యార్థులకు జాతర ప్రాముఖ్యత గూర్చి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, పీడీ రమేశ్, టీచర్లు జయలక్ష్మి, శైలజ, శిరీష, జ్యోతి, మంజుల, ప్రేమ్‌సాగర్, కిషన్, సర్వర్, శ్రీనివాస్‌రెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ జయంతి

కరీంనగర్: జిల్లాకేంద్రంలోని కోర్టు చౌరస్తాలో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అంది సాగర్ మాట్లాడుతూ.. ఉత్తర భారతదేశంలో అట్టడుగు వర్గాలు రాజ్యంలోకి రావడానికి సంత్ రవిదాస్ నిర్మించిన సాంస్కృతిక ఆధ్యాత్మిక ఉద్యమమే కారణమని అన్నారు. అదే స్ఫూర్తితో మాదిగ జాగృతి సంఘం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జంగా అంజన్‌బాబు, సంపత్, రమేశ్, బెజ్జంకి రవీందర్, డీఎస్పీ నాయకులు నరేష్, ఆరెల్లి బాబు, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో ఆధ్యాత్మిక గొప్ప గురువు సంత్ రవిదాస్ మహారాజు జయంతిని జరుపుకోవాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బోయినిపెల్లి చంద్రయ్య పిలుపునిచ్చారు. సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. భక్తి ఉద్యమ తాత్వికాల్లో అగ్రగామి సంత్ శిరోమణి రవిదాస్‌జీ మహారాజు ఫిబ్రవరి నెల నాగ పూర్ణిమ చమార్ కులంలో కాశిపట్నం సమీపంలో జన్మించారన్నారు. చర్మకార వృత్తి కులాలు అనేవి మనుషులు సృష్టించినవని అన్నారు. సాంఘిక దురాచారాలను నిర్మూలించే ప్రయత్నం చేశారన్నారు. సమాజంలో కొంతమందితో సంపద, జ్ఞానం, సమానత్వం దూరమయ్యాయని అన్నారు. చల్పూరి రాంమూర్తి, గోష్కి శంకర్, సిగిరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

కరీంనగర్‌రూరల్: మొగ్దుంపూర్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న చీటి కార్తీక్ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయలేదనే కారణంతో శనివారం కరీంనగర్‌టౌన్ డీఈ రాజం(ఆపరేషన్) సస్పెండ్ చేశారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు వ్యవసాయ బావులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా.. ఆపరేటర్ కార్తీక్ విద్యుత్ సరఫరా చేయలేదనే రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ నిర్వహించారు. అనంతరం కార్తీక్‌ను సస్పెండ్ చేస్తూ డీఈ రాజం ఉత్తర్వులు జారీ చేశారు.

నియామకం

కరీంనగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా విజయభాస్కర్ ఎన్నికయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ శనివారం నియామక ప్రకటన విడుదల చేశారు. అవకాశం కల్పించిన ఎంపీ బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శ్రేణులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

‘సహకార’ రాజకీయం

- చైర్మన్ సీటుకు బీఆర్‌ఎస్‌లో పోటాపోటీ
- ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డైరెక్టర్లతో క్యాంప్
- 27న దుర్శేడ్ సొసైటీ చైర్మన్ ఎన్నిక

కరీంనగర్‌రూరల్: మండలంలో ఒక్కసారిగా సహకార రాజకీయం వేడెక్కింది. చైర్మన్ సీటు కోసం బీఆర్‌ఎస్‌లో తీవ్రమైన పోటీ నెలకొనడంతో.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదేశాల మేరకు శనివారం డైరెక్టర్లను రహస్య శిబిరానికి తరలించారు. ఈనెల 27న దుర్శేడ్ సహకార సంఘం చైర్మన్ ఎన్నికను నిర్వహించేందుకు సహకార శాఖ నోటిఫికేషన్ జారీ చేయడంతో రాజకీయం ఊపందుకుంది. ఏడాది క్రితం చైర్మన్ బల్మూరి ఆనందరావు గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందడంతో.. వైస్ చైర్మన్ గోనే నర్సయ్యను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. అయితే చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ కావడంతో.. రెండు రోజుల నుంచి బీఆర్‌ఎస్‌లో విందు రాజకీయాలు ఊపందుకున్నాయి.



దుర్శేడ్ సింగిల్‌విండో కార్యాలయం

ప్రస్తుత ఇన్‌చార్జి చైర్మన్ గోనే నర్సయ్యకు కొందరు డైరెక్టర్లు సపోర్టు చేస్తుండగా.. డైరెక్టర్ తోట తిరుపతి మెజార్టీ డైరెక్టర్ల మద్దతును కూడగట్టి చైర్మన్ సీటు పొందాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే డైరెక్టర్లందరూ బీఆర్‌ఎస్‌కు చెందిన వాళ్లే కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ కొంతమంది డైరెక్టర్ల మద్దతు కోసం రహస్య మంతనాలను చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డైరెక్టర్లందరినీ క్యాంపునకు తరలించాలని నిర్ణయించారు. ఈనెల 27న జరిగే ఎన్నిక రోజున చైర్మన్ పేరు ప్రకటిస్తామని ఎమ్మెల్యే చెప్పడంతో.. బీఆర్‌ఎస్ నాయకులు మొత్తం 13 మంది డైరెక్టర్లలో శనివారం 10 మందిని భద్రాచలం, పాపికొండలు టూర్‌కు తరలించినట్లు తెలుస్తోంది.